క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం గోపాలపట్నంకి చెందిన బొప్పన వాణి అనే దాత రూ. లక్షా 1116 విరాళం నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద పథకం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

నేడు వైఎస్సార్ ఆసరా వారోత్సవాల బహిరంగ సభ

పరవాడ: వైఎస్సార్ ఆసరా నిధుల వారోత్సవాల బహిరంగ సభను స్థానిక సంతబయలు ప్రాంతంలో గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ డ్వాక్రా అక్కచెల్లమ్మలకు 4వ విడత రుణమాఫీ నిధులు అందజేస్తారని చెప్పారు. సభకు మండలంలో ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రహ్లాద కల్యాణ మండపం స్వాధీనం చేసుకోవాలి

సింహాచలం: సింహాచలం దేవస్థానానికి చెందిన నగరంలోని ప్రహ్లాద కల్యాణ మండపాన్ని సీఆర్‌పీఎఫ్ నుంచి స్వాధీనం చేసుకోవాలని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. ఈ మేరకు బుధవారం ఈవోకు వినతిపత్రం అందజేశారు. నగరంలోని జగదాంబ జంక్షన్‌లో అత్యంత విలువైన ప్రహ్లాద కల్యాణ మండపం దేవస్థానానికి ఉందని తెలియజేశారు. 2013లో కేవలం ఆర్నెల్లకు తాత్కాలిక వసతిగా ప్రహ్లాద కల్యాణమండపాన్ని సీఆర్‌పీఎఫ్‌కి కేటాయించారని పేర్కొన్నారు. కానీ నేటి వరకు ఖాళీ చేయలేదని తక్షణమే స్పందించి మండపాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

బాలికలకు తమ హక్కులపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుకన్య, అధ్యాపకులు

గోపాలపట్నం: బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బెహరా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య అన్నారు. నరవలోని బెహరా కళాశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నిరంగాల్లో బాలికలు ముందంజలో ఉన్నా వివక్షకు బలవుతూనే ఉన్నారన్నారు. తమ సమస్యలు తామే పరిష్కరించుకునే విధంగా బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. బాలికల హక్కుల గురించి వివరించారు. బెహరా విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బెహరా విజయ చైతన్య , కళాశాల అధ్యాపకులు కీర్తి, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పినగాడి.. ప్రగతిబాట

- రూ.4.20 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.12.55 కోట్ల పంపిణీ
- మారిన గ్రామ రూపురేఖలు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు





రూ.2 కోట్లతో నిర్మించిన పినగాడి-గొల్లలపాలెం రహదారి



పినగాడిలో నిర్మించి గ్రామ సచివాలయం



రూరల్ వెల్‌నెస్ సెంటర్

పెందుర్తి: గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నడుం బిగించింది. ప్రగతి బాట పట్టించింది. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల మోములో ఆనందం నింపింది. నియోజకవర్గంలో కీలకమైన పంచాయతీల్లో ఒక్కటైన పినగాడి రూపు రేఖలు మార్చింది. ఇక్కడ 15 ఏళ్లుగా జరిగిన అభివృద్ధి ఒక ఎత్తయితే.. నాలుగున్నరేళ్లలో ఈ పంచాయతీ అన్ని రంగాల్లో దూసుకుపోయింది. సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి జయరామ్ సారథ్యంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సహకారంతో పినగాడి నియోజకవర్గంలోనే మోడల్‌గా నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.12.55 కోట్లు కేవలం సంక్షేమ పథకాల ద్వారానే ప్రజలకు పంపిణీ చేసింది. రూ.4.20 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించింది. దీంతో పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్మశాన వాటికకు రూ.21 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

రికార్డు స్థాయిలో సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పినగాడి పంచాయతీలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా రూ.12.55 కోట్లు నగదు రూపం ఖాతాల్లో చేరాయి.
- అమ్మ ఒడి పథకం ద్వారా 241 మందికి రూ.1,15,25,300 అందింది.
- జగనన్న విద్యా దీవెన కింద 211 మందికి రూ.70,45,227, జగనన్న వసతి దీవెన పథకంలో 170 మందికి రూ.27,66,889 అందాయి.
- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.283 మంది రైతులకు రూ.1,41,39,300 నగదు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా తొమ్మిది మందికి రూ.75,960, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా 19 మందికి రూ.71,370, సున్నా వడ్డీ పంటరుణాల ద్వారా వడ్డీ రూపంలో 14 మందికి రూ.23,902 ఖాతాల్లో జమైంది.
- వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 331 మందికి రూ.3,19,57,750 నగదు చేరింది.
- వైఎస్సార్ చేయూత ద్వారా 185 మందికి రూ.79,12,500 అక్కచెల్లెమ్మలకు అందింది.
- వైఎస్సార్ ఆసరా(డ్వాక్రా రుణమాఫీ) ద్వారా 391 మందికి రూ.1,38,53,853 నగదు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో పడింది.
- వైఎస్సార్ సున్నావడ్డీ పథకం(ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు) ద్వారా 676 మందికి రూ.7,51,848 నగదు అందింది.
- వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా నలుగురికి రూ.80 వేలు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం ఇద్దరికి రూ.60 వేలు అందాయి.
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 117 మంది చికిత్స చేయించుకోగా వారికి రూ.33,94,839 బిల్లులు ప్రభుత్వం చెల్లించింది.
- వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా 76 మందికి రూ.4,73,825 లబ్ధి చేకూరింది.
- హౌసింగ్ ద్వారా 13 మందికి రూ.4,58,564 చెల్లింపులు జరిగాయి.
- వైఎస్సార్ బీమా ద్వారా 8 కుటుంబాలకు రూ.9,90,000 నగదు చెల్లించి అండగా నిలిచింది ప్రభుత్వం.
- వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా 85 మంది ఆటో, ట్యాక్సీ కార్మికులకు రూ.27,90,000 ఖాతాల్లో పడ్డాయి.
- జగనన్న చేదోడు(రజకులు, నాయిబ్రాహ్మణులు, దర్జీలు) 20 మందికి రూ.4,90,000 నగదు చెల్లించి చేయూత నందించింది.
- తెల్ల రేషన్ కార్డు ఉన్న 688 మందికి ప్రత్యేక కోవిడ్‌సహాయం ద్వారా రూ.6,88,000 సహాయం అందించింది.
- జగనన్న తోడు పథకం ద్వారా 110 మందికి రూ.49,093 చెల్లింపులు జరిగాయి.
- ఇవి కాకుండా పరోక్షంగా పినగాడి పంచాయతీప్రజలకు రూ.2,57,21,021 లబ్ధి చేకూరింది.

అభివృద్ధికి పెద్దపీట...

- అభివృద్ధి పనుల కోసం రూ.4.20 కోట్లు వెచ్చించారు.
- పినగాడి-కోట్నీవానిపాలెం-గొరపల్లి-గొల్లలపాలెం రహదారి రూ.2 కోట్లతో వేశారు.
- రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి రూ.23.94 లక్షలు వెచ్చించారు.
- రూరల్ వెల్‌నెస్ సెంటర్(ఆరోగ్య కేంద్రం) నిర్మాణానికి రూ.20.8 లక్షలు కేటాయించారు.
- గ్రామ సచివాలయం రూ.25 లక్షలతో నిర్మించారు.
- పినగాడి గ్రామంలో రూ.80 లక్షలు, శివారు గ్రామం కోట్నీవానిపాలెంలో రూ.40 లక్షలతో ఇంటింటి కుళాయి పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.21 లక్షలు వెచ్చించారు.
- గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.15 లక్షలతో కొత్తగా సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేయనున్నారు.

జగన్‌బాబు ఎంతో మేలు చేశాడు



జగన్‌బాబు ప్రజలకు మేలు చేద్దామని నిరంతరం ఆలోచిస్తున్నాడు. మాకు డ్వాక్రా రుణమాఫీ ద్వారా ఎంతో మేలు జరిగింది. ఏడాదికి రూ.26,684 చొప్పున నాలుగేళ్లకు రూ.1,06,736 రుణమాఫీ అయింది. అలాగే రైతు భరోసా, ఇతర పథకాలు అందాయి. వైఎస్ జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– కిల్లి ముత్యవమ్మ, పినగాడి

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



ఒంట్లో బాగోపోతే పెందుర్తి వెళ్లాల్సి వచ్చేది. ఉదయం వెళితే సాయంత్రం తిరిగి వచ్చేవాళ్లం. ఇప్పుడు జగన్‌బాబు దయ వల్ల గ్రామానికే వైద్యులు వచ్చి పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందులు ఇస్తున్నారు. మందులు ఖర్చు తగ్గడం చాలా ఆనందంగా ఉంది. తాజాగా ఊళ్లోనే ఆస్పత్రి కట్టారు. అలాంటి జగన్ మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలి.

– గొర్లి చిన్నారావు

అభివృద్ధికి మారుపేరు



20 ఏళ్లలో నా భర్త బయిలపూడి భగవాన్ జయరాం సారథ్యంలో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాం. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మా పంచాయతీ రూపురేఖలే మారిపోయాయి. సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు రూ.12.55 కోట్లు అందాయి. అభివృద్ధిలో కూడా మా పంచాయతీ ముందుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లకు ధన్యవాదాలు.

– బయిలపూడి వెంకటలక్ష్మి జయరాం, సర్పంచ్, పినగాడి.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ దేవి



బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడకారులకు ఎనలేని ప్రోత్సాహం అందిస్తుందని మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి అన్నారు. ప్రతిభ ఉండి వెలుగులోకి రాని క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. దీని ద్వారా ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రభుత్వం దన్నుగా నిలిచి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చి దిద్దుతుందన్నారు. నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మండలంలోని పినగాడి విస్తం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం వారు ప్రారంభించారు. ప్రత్యేక డెప్యూటీ కలెక్టర్ శేష శైలజ, పెందుర్తి, పరవాడ ఎంపీడీవోలు కె.వసంత, వి.హేమసుందరరావు, పెందుర్తి ఏవో కె.వెంకటరావు, జీవీఎంసీ ఏపీడీ వై.వై శ్రీరాం, ఆడుదాం ఆంధ్రా బ్రాండ్ అంబాసిడర్ ప్రతాప్, పీఈటీలు, సచివాలయల సిబ్బంది పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు



ఖోఖోలో క్రీడాకారులు

ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీ ఫైబర్‌నెట్ జిల్లా మేనేజర్ మోహన్‌రావు

పరవాడ: ప్రతిఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీ ఫైబర్ నెట్ జిల్లా మేనేజర్ గంటా మోహన్‌రావు అన్నారు. పరవాడలో బుధవారం ఏర్పాటు చేసిన కేబుల్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్ అవసరమైందన్నారు. వినియోగదారులకు రూ.190 లకే ఇంటర్నెట్ ప్యాకేజీ అందిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా పంచాయతీ కార్యాలయాల్లో ఓఎల్టీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ ఎస్‌ఎఫ్‌ఎల్ మేనేజర్ పిల్లా సతీష్, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే



ఉత్తమ డ్రైవర్ రాజును సత్కరిస్తున్న డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధవారం డ్రైవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోకు చెందిన బస్సులతో పాటు అద్దె బస్సు డ్రైవర్లకు కె.రాజశేఖర్ మిఠాయిలు పంచి అభినందనలు తెలిపారు. అలాగే డిపోలో 36 ఏళ్లుగా డ్రైవరుగా పనిచేస్తూ ఏవిధమైన యాక్సిడెంట్ చేయకుండా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్‌ఏఎస్ రాజును అభినందించారు. అలాగే డ్రైవర్లకు సంఘీ భావంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎల్. సాయితులసి, డిప్యూటీ సూపర్‌వైజర్ కొండలరావు, ఎస్‌టీఐ కె. కుమారి, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రూ.1.73 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 95వ వార్డు కృష్ణరాయపురం, పాపయ్యరాజుపాలెం ప్రాంతాల్లో రూ.1.73 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ జీవీఎంసీ విలీన ప్రాంతాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆడ పిల్లల్లో అభద్రతాభావం తొలగించాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

సబ్బవరం: ఆడ పిల్లల్లో ఉండే అభద్రతాభావం తొలగించి వారి ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే లక్ష్యంతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పనిచేస్తుందని కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు.జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ,జిల్లా బాలల సంరక్షణ విభాగం,సర్వ శిక్షా అభియాన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికల బంగారు భవితకు అందరం చేతులు కలుపుదాం పేరిట రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల సంరక్షణ,వారి హక్కులు,ఆరోగ్యం, విద్య,సంక్షేమంపై కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో యావత్ కమిషన్ సభ్యులు డేగ కళ్లతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. వివక్ష లేకుండా సమాజంలో అన్ని రంగాల్లో ఆడపిల్లలు వికసించాలనే లక్ష్యంతో కమిషన్ పని చేస్తుందన్నారు. బాల్యం నుంచే ఆడపిల్లలను అభివృద్ధి వైపు పరుగులు తీయిద్దాం, మగపిల్లలతో సమానంగా అన్ని అవకాశాలు అందిపుచ్చుకునేలా ప్రోత్సహించడానికి యావత్ సమాజం సహకరించాలని పిలుపునిచ్చారు. బాలల హక్కులకు విఘాతం కలిగితే బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సహించదన్నారు. ముందుగా సబ్బవరం గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సంక్షేమం,వసతులు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.రూపావతి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.లలిత కుమారి, సీఐ పి.రమణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.సూర్యనారాయణ, ఎంఈవోలు ఎస్.లక్ష్మణ రావు, బి.సూర్య నారాయణ మూర్తి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పద్మావతి, కె.జి.బి.వి.పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.మృదుల, మెడికల్ ఆఫీసర్ సి.హెచ్.ఆషా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం జేసీకి జర్నలిస్టుల వినతి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

మహారాణిపేట : జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాలకు సంబంధించి 60:40 నిష్పత్తిలో కాకుండా ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ఉచితంగా లేదా నామ మాత్రపు ధరకు ఇవ్వాలని జర్నలిస్టు సంఘాలు కోరాయి. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. విశాఖ జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టులకు తొలి ప్రాధాన్యత ఇచ్చిన తర్వాతే స్టేట్ హెడ్ క్వార్టర్‌లో పని చేస్తున్న వారిని పరిగణనలోకి తీసుకోవాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్‌ఎన్‌ఏ) అధ్యక్షుడు పి.సత్యనారాయణ కోరారు. 2023లో అక్రిడేషన్ లేనప్పటికీ గతంలో కలిగి ఉంటే వారికి కూడా స్థలాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కరోనాతో, ఆ తర్వాత మరణించిన జర్నలిస్టుల తరఫున వారి కుటుంబాలకు స్థలాలు కేటాయించాలని పేర్కొన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో స్థానికులై గతసారి విశాఖలో అక్రిడేషన్ కలిగి సర్దుబాటులో భాగంగా ఏఎస్‌ఆర్, అనకాపల్లి జిల్లాల్లో ప్రెస్ అక్రిడేషన్ కలిగి ఉండే వారికి విశాఖ జిల్లాలో స్థలాలు కేటాయించాలన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలు తీసుకెళ్తామని, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. విశాఖ జిల్లా వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె. చంద్రమోహన్, ఎల్‌ఎన్‌ఏ కోశాధికారి ఆర్.అబ్బాస్, ప్రతినిధులు బండారు శివ ప్రసాద్, బీఏ నాయుడు, ఏపీజేయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీధర్, ఎం. శ్రీహరి, ఎస్.మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశాఖ ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్‌కు కూడా జర్నలిస్టు సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: వేపగుంట సమీపంలోని పద్మనాభనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. పద్మనాభపురం, కంపరపాలెం కాలనీ, జనతాకాలనీ, నందమూరినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని గోపాలకృష్ణనగర్, కార్మికనగర్, సప్తగిరినగర్, పీఎఫ్ కాలనీ, చినముషిడివాడ పాతూరు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శానాపతి వసంత బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో తారు రోడ్లు, సీసీ కాలువలు, కల్వర్టుల నిర్మాణం కోసం జీవీఎంసీ రూ.2 కోట్లు విడుదల చేసిందని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకుడు శానాపతి శంకర్రావు, ఆయా కాలనీ ప్రతినిధులు రామారావు, జగన్, అర్జున్, కొండబాబు, మహేష్, కిషోర్, రాంబాబు పాల్గొన్నారు.

19 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: తానాం గ్రామంలోని రెండు పాన్‌షాపుల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఎస్.తేజేశ్వరరావు తన సిబ్బందితో బుధవారం ఆయా షాపులపై దాడులు జరిపారు. పి.వీరునాయుడుకు చెందిన పాన్‌షాపులో (180ఎంఎల్) 12 మద్యం సీసాలు, సీహెచ్.సూర్యానారాయణకు చెందిన పాన్‌షాపులో (180ఎంఎల్) 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.తేజేశ్వరరావు చెప్పారు.

నేడు సింహగిరిపై పునర్వసు హోమం

సింహాచలం: సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం పునర్వసు నక్షత్ర హోమం విశేషంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

బెస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌గా పెందుర్తి



సీపీ రవి శంకర్ సమక్షంలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి అవార్డు స్వీకరిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రమేష్

పెందుర్తి: నగరంలో ఉత్తమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌గా పెందుర్తి ఎంపికైంది. ఈ మేరకు నగరంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ సమక్షంలో ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి చేతుల మీదుగా పెందుర్తి ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి రమేష్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ పెందుర్తి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు.